# ప్రేమ ధ్యానము

మొట్టమొదట ప్రేమతత్త్వసాధన. సాధన తరువాత 5 నిమిషాల పాటు రామనామం చేసిన తరువాత ఈ కార్యక్రమం మొదలు పెడదాము.దీని అవసరం ఇక్కడ నాకు చాల స్పష్టముగా అనిపించింది అంటే దేని అవసరం? ప్రేమతత్త్వ సాధన. అది ఎంతగా లోపించిందంటే అధ్యాత్మిక జగత్తులోనే పరస్పర అవగాహన లోపం వలన కలసిమెలసి ఏ పనినీ చేయలేకపోవడం గమనిస్తూ ఉన్నాను. దాన్ని ముందు పోగొట్టుకుంటే తప్ప ఎంత అద్భుతమైన కార్యక్రమాల గురించి మనం మాట్లాడుకున్నా, ఎంత గొప్పగా గొప్ప పనుల గురించి మాట్లాడుకున్నా, ఎన్ని సిద్ధక్షేత్రాలు స్థాపించినా అవి ఎందుకు పనికిరాని క్షేత్రాలు గానే మారుతాయి. కనుక ప్రేమతత్త్వము గురించి 15 నిమిషాలు ధ్యానం చేద్దాము. ఈ ధ్యానము మనం నిరంతరము మాట్లాడుకుంటాము. ఇక్కడ నేను మాట్లాడుతాను, మీరు మీ ఇంట్లో పని చేసుకుంటున్నప్పుడు మీలో మీరే మాట్లాడుకుంటారు.

భగవంతుడు ప్రేమ స్వరూపుడు. కానీ, ప్రేమ అనే తత్త్వాన్ని పూర్తిగా విస్మరించాము మనము. ధ్యానము అనే పదానికి చాలా సార్లు మనము ఏమనుకుంటామంటే కళ్ళు మూసుకుని కూర్చోవడం అని, గురువు నామోచ్చారణ చేసి కళ్ళు మూసుకుని కూర్చుంటాము, తరువాత చేసేదేదో ఆ గురువు చేస్తాడు. అది ఒక రకమైనటువంటి ధ్యానము. కానీ ఈనాడు మానవజాతి ఉన్నటువంటి స్థితికి పరిపూర్ణ స్థాయిలో సంపూర్ణ సమర్పణ చేసుకుని తన శరీరము అప్పగించడము చేత కాదు.మీరు నిజంగా సమర్పణ చేసుకున్నారో, లేదో అన్నదానికి ఒక చిన్న ఉదాహరణ మనకి గురుచరిత్రలో నామధారకుడి విషయంలో వస్తుంది. నామధారకుడి వంశంలో వాళ్ళు గురువు యొక్క అనుగ్రహం అన్ని రకాలుగా పొందిన వాళ్ళు. వాళ్ళ గురించి చదువుతాడు. అయితే నాకు ఏమి లాభం అయ్యింది. వాళ్ళకు అయ్యింది. అవి చదవడం వల్ల నాకు ఏమీ కాదు కదా అని గురువు అనుగ్రహానికై గురువును వెతకడానికి బయలుదేరతాడు. మనము ఆ గురుచరిత్రలోని ఒక ముఖ్యమైన విషయము సాధారణంగా విస్మరిస్తాము.

ఈ విషయము మీకు అర్థమయితే ప్రేమతత్త్వంలో దుఃఖమే సుఖమనిపిస్తుంది అని తెలుస్తుంది. మన జీవితాలలో ఉన్నటువంటి దుఃఖాలకి, మన జీవితాలలో లేనటువంటి ఆనందమయస్థితికి కూడా ఆ గురువే కారణము అనే భావన వచ్చే వరకు మనము ఆధ్యాత్మిక జీవితంలో ప్రవేశించలేము. మనము మన పిల్లలని ప్రేమరాహిత్యంతో కొట్టము.వాళ్ళకి మంచి నేర్పించడానికి, బాగుపడడానికి కోప్పడతాము, కొడతాము. దాని వెనకాతల మన ప్రేమ ఉంది కదా వాళ్ళ పట్ల. అదే మన గురువుగారు మనకి మొట్టికాయలు వేస్తున్నారు అంటే ఎందుకు కంగారు పడతారు? అసలు మొట్టికాయలు వేస్తున్నడు అంటేనే అర్థము మిమ్మల్ని లైనులో పెడుతున్నాడు అని అర్థం. అంచేత ఇది అంతా ప్రేమతత్త్వ సాధనే. ఇలానే

మీరు మీ ఇంట్లో కూర్చుని 15 నిమిషాలు ఈ విధంగా ఆలోచించుకోండి, ఆ ఆలోచించుకునే విధానమే ధ్యానము అంటున్నాను.

జీవితంలో ఉండే ప్రతీ దానికీ కూడా ఈ విశాల విశ్వంలో ఎన్ని శక్తిధారలు పని చేస్తున్నాయో మీకు తెలుసా? సూర్యుడి నుంచి గ్రహాల ద్వారా నిరంతరము అనేక శక్తిధారలు మన భూమి మీదకు వస్తూంటాయి. ఎలాగయితే టి.వి టవర్ నుంచి నిరంతరము దూరదర్శన్ ధారలు వస్తూంటాయో అలా. కాని ఆ ఛానల్ ధారలు ఎవరికి కనిపిస్తాయి? టి.వి ఆన్ చేసుకున్నవాడికి. అలాగే ప్రకృతిలో ఉన్నటువంటి ప్రేమతత్త్వం వలన, ప్రకృతిలో ఉన్నటువంటి విశాలమైన,అత్యంత శక్తిమైనటువంటి శక్తిధారలను ఎవరు తెలుసుకోగలరు? తనలోని ఆ రెసీవర్ ని ఆన్ చేసుకోగలిగిన వాళ్ళు. నేలలో నాటిన విత్తనం మనం నీళ్ళుపోసి కావలసిన ఎరువులు అవి వేస్తే, మొలకెత్తడానికి ఎంత బాధలు పడుతుందో తెలుసా? ఎంత శక్తితో నేలను బద్దలు కొట్టుకుని వస్తుందో ఏ సైన్స్ స్టూడెంట్ అయినా చెప్తాడు. దానికి ఆ శక్తి ఎక్కడ నుంచి వచ్చింది. అది బాధపడి బ్రద్ధలవడంతోటి వచ్చింది ఆ శక్తి. నేను ఎలా ఉన్నానో అలానే ఉంటాను, నాలో మార్పులు ఏమీ రాకూడదు. నేను ఎలా ఉన్నానో అలా ఉండగానే మార్పులు వచ్చేయాలి అనుకుంటే మార్పులు రావు. ఆ గురువుల చరిత్రలు చదువుతే వాళ్ళు ఎన్ని రకాల కష్టాలు పడితే ఆ స్థాయికి వెళ్ళారో అర్ధమవుతుంది. ఆ గురువుల యొక్క శక్తి స్థాయికి మనమూ వెళ్ళాలంటే మూడు విషయాలు గుర్తుంచుకుంటే చాలు.

గురుర్ బ్రహ్మ, గురువిష్ణు, గురుర్దేవో మహేశ్వరః

## ముఖ్యమైనది ప్రేమతత్త్వము:

గురుర్ బ్రహ్మ, గురువిష్ణు, గురుర్దేవో మహేశ్వరః, ఈ గురుతత్త్వాన్నే ప్రేమతత్త్వము అని కూడా అంటాము. ఏం చేస్తున్నాడీ గురువు. గురుబ్రహ్మకి సృష్టించే శక్తి ఎక్కడ ఉంది, శరీరంలో ఉందా? ప్రకృతిలో ఉంది. ప్రకృతిలో ఉన్నటువంటి సృష్టించే శక్తిని అతను ఉపయోగించుకున్నాడు. ప్రకృతిలో పదార్థాలలో ఉన్న శక్తిని మనము దాని నియమాలు తెలుసుకుని దానికి అనుగుణ్యంగా ప్రవర్తిస్తే ఆ శక్తి మనకు వస్తుంది. అలాగే ఆధ్యాత్మిక జగత్తులో ఆధ్యాత్మిక నియమాలు తెలియాలి. అందులో ముఖ్యమైనది ప్రేమతత్త్వము. అది తెలియకుండా ఆధ్యాత్మిక జగత్తులోనికి ప్రవేశిస్తే రకరకాల సందేహాలు వచ్చి మనము ముందుకు వెళ్ళడం జరగదు. మన పిల్లవాడు కష్టాల్లో ఉన్నాడు అంటే ఏ తల్లి వెళ్ళి ఆదుకోవడానికి ప్రయత్నించదు? మనవాళ్ళు ఆపదల్లో ఉన్నారు అని మనకి తెలిసిన దగ్గర నుంచి మన హృదయంలో ఏదో విచిత్రమైనటువంటి ఆవేదన అనిపిస్తుంది.అది గురుబ్రహ్మ చెబుతుంది.

అందరి హృదయాలలో ఉన్న బాధ ఎప్పుడైతే మీరు అనుభవిస్తారో అప్పుడు సర్వజ్ఞత్వం వస్తుంది. సర్వజ్ఞత ఎప్పుడు వస్తుందో, అప్పుడు ఏం చేస్తారు మీరు? మీకెవ్వరూ చెయ్యమని చెప్పరు ఏం చెయ్యాలో, మీరే చేస్తారు ఏం చేయాలో. కాని తప్పు ఎక్కడ వచ్చింది ఆధ్యాత్మికతలో అంటే మీ కోర్కెలు తీర్చుకోవడమే ఎప్పుడూ. మీ కోర్కెలు తీరిపోతే చాలు, ఆ భ్రాంతిలో పక్కవాళ్ళు ఏమై పోతున్నారో మీరు చూసుకోనక్కర్లేదనే భ్రాంతిలోనే మన జీవితాలు నడుస్తున్నాయి. మనకు ఎందుకు సర్వజ్ఞత్వం వస్తుంది? గురువు సర్వజ్ఞుడు. ఆ సర్వజ్ఞత్వంతో అందరి బాధ తీరుస్తున్నాడు. ఎందుకంటే అందరి బాధ తన బాధే అనిపిస్తుంది కనుక. అందుకే 1918లో సమాధి చెందిపోయినా ఇప్పటికీ శిరిడీసాయి మనలని బాధలలో ఆదుకుంటున్నాడు. ఎందుకు ఆదుకుంటున్నాడు? ఏమిటి సంబంధం మనకి ఆయనకి? మీ బాధ నివారించమని అడగడానికి మీకు ఏం హక్కు ఉంది. ఒక శిరిడీసాయిని గాని, సత్యసాయిని గాని, ఒక శ్రీ రామశర్మ గారిని గానీ, బ్లావట్స్కీని గానీ, ఒక రామకృష్ణ పరమహంసను గానీ ఏమి హక్కు ఉంది మీకు అడగడానికి? ఏ విధమైన సంబంధబాంధవ్యాలు ఉన్నాయి? ఉన్నాయా? ఉన్నాయి. కనుకనే అడుగుతున్నాము. " అఖండమండలాకారం వ్యాప్తం యేన చరాచరం". మనలో కూడా ఆయన అంతర్యామిగా ఉన్నాడు. కనుకనే మన బాధలు ఆయన బాధలు అనుకుంటాడు. అందువలననే మనం అంత ధైర్యంగా అడగగలుగుతున్నాము. సర్వవ్యాపకత్వంలో గురువులో ఉండే తత్త్వం ప్రేమతత్త్వం. ఇదంతా ఎందుకు చెబుతున్నాను అంటే మీలో ఆ ప్రేమతత్త్వాన్ని అభివృద్ధి పరచుకుంటే ఆ సర్వవ్యాపకశక్తులు మీ వైపు ఆకర్షింపబడతాయి.

మనకి ఎందుకు అడిగే హక్కు ఉందంటే సాధనా బలంతో సర్వవ్యాపకుడు అయ్యాడు కనుక అన్ని చోట్లా ఉన్నాడు కనుక, మీలో కూడా ఉన్నాడు కనుక, మీరు కూడా ఆ గురువు యొక్క అంశ కనుక, కానీ ఇంకొక్క లక్షణం కూడా గురువుల గురించి చెప్పుకుంటాము " గురుర్దేవో మహేశ్వరః". గురువు ఏదైనా చేయగలడు అని, కొంతమంది చనిపోయినవారిని బ్రతికించాడు కదా! మరి, అందరిని బతికించేయవచ్చు కదా? చాలా ఇంటరెస్టింగ్ ప్రశ్న వస్తుంది. గురువుకు ప్రేమే ఉంటే నిజంగా గురువే సర్వవ్యాపి అయితే నిజంగా గురువుకే సర్వసమర్ధత ఉంటే నా కష్టాలన్నీ ఈ క్షణంలో తీఎర్చేయవచ్చు కదా? గురువు యొక్క సర్వసమర్ధత యొక్క లక్ష్యమేమిటి అంటే, మీ పిల్లలకు అడుగులు వేయడం నేర్పుతున్నప్పుడు మీరు వేలు పట్టుకుని ముందు రెండు అడుగులు నేర్పుతారు. తరువాత చేయూత యివ్వం, ఎందుకంటే వారికి స్వయంగా నడవడం రావడానికి.

అలాగే సర్వజ్ఞుడైనటువంటి గురువు మీకు నడవడిక నేర్పేటప్పుడు అలానే చేస్తే అది తప్పు ఎలా అవుతుంది? మిమ్మల్ని ఎక్కడ ఆపాలో, ఎక్కడ కాపాడాలో సర్వజ్ఞుడైనటువంటి ఆ గురువుకి తెలియదు అనుకోవడం మన అల్పజ్ఞత్వం. నేను కష్టాలు పడిపోతున్నాను, ఇంకా నన్ను కాపాడడం లేదు అంటే అర్ధం మీ సామర్ధ్యం మీద అతనికి నమ్మకం ఉంది అని. మిమ్మల్ని ఇంక ఆదుకోనవసరం లేదు అని ఆ గురువు భావిస్తే నీకు ఆ సామర్ధ్యము ఉన్నట్లే లెక్క.

ఇటువంటి సర్వజ్ఞుడైనటువంటి, సర్వవ్యాపకుడైనటువంటి,సర్వసమర్థుడు అయిన గురువు ఎక్కడ దొరుకుతాడు మీకు? ఒక శిరిడీలో దొరుకుతాడా? ఒక కుంభకోణంలో దొరుకుతాడా? లేక తిరుపతి కొండ మీద దొరుకుతాడ? అని మీరు ఆలోచిస్తే మీకు నేను చెప్పినది ఏది అర్థంకాలేదు అన్నమాట. ఎందుకంటే సర్వవ్యాపకుడు అయిన గురువు ఎక్కడ అంటే అక్కడే ఉన్నాడు కదా.

ప్రహ్లాదుడు తండ్రిని చూసి ఇదే అంటాడు. సర్వవ్యాపిని వెతుకుతున్నానంటావు, సర్వవ్యాపిని వెతకాల్సిన పనిలేదు. ఆయన ఎక్కడ అంటే అక్కడే ఉన్నాడు. అందుచేత మీకు గురువుకి మధ్య స్నేహసంబంధాలు, ఆ ప్రేమ ఉండాలి. అంటే గురువు సర్వజ్ఞత్వం మీద, సర్వవ్యాపకత్వం మీద నమ్మకం ఉండాలి. ఆ సర్వసమర్థత మీద నమ్మకం ఉన్న ప్రతీ వ్యక్తి కూడా ఆ గురువు యొక్క లక్షణాలను పుణికి పుచ్చుకుంటాడు. ఆ సర్వసమర్థుడుని, సర్వవ్యాపకుడైన గురువుని పట్టుకోవడానికి ఈ రెండు శ్లోకాలు చదువుతాము.

" గురుః బ్రహ్మ గురు విష్ణుః గురుర్దేవో మహేశ్వరః

గురుసాక్షాత్ పరంబ్రహ్మ, తస్మై శ్రీ గురవే నమః"

" అఖండమండలాకారం వ్యాప్తం యేన చరాచరం

యత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవే నమః "

అని కళ్ళు మూసుకుని ఆ సర్వసమర్థుడుని, సర్వవ్యాపకుడిని ఆ సర్వజ్ఞుడినిని ఆలోచించుకోండి.

ఆ భావం మీలో రావాలి. ఆ పులకింత మీలో రావాలి. రాకపోతే మీలోకి ఆ గురువు మాత్రం ఎలా ప్రవేశిస్తాడు? ఆ శక్తిధారలలో మనం కూర్చుని ఉన్నాము అనే భావన, ఏ శక్తిధారలయితే ఈ అనంత విశ్వాన్ని నడిపిస్తున్నాయో ఆ శక్తిధారలు. మామిడి చెట్టు, మామిడిచెట్టుగానే దాని ప్రక్కన ఉన్న వేపచెట్టు వేపచెట్టుగానే ఉంటుంది కదా? దాని ప్రక్కన కొబ్బరిచెట్టు వేస్తే అది కొబ్బరిచెట్టుగానే ఉంటుంది కదా. ఏ శక్తి అంత ఖచ్చితంగా వేటికి కావలసిన శక్తిని వాటికి అందిస్తూ ఉంది. అది మన కంటి ముందే కనిపిస్తుంది కదా. ఆ సర్వవ్యాపకత్వము,ఆ అనంతచేతనత్త్వము అణువణువునా మనకు కనిపిస్తూనే ఉంది కదా?అంత అద్భుతమైనటువంటి శక్తి ఎవరైనా బాధపడిపోతూ ఉంటే చూడగలదా? ఎవరైనా బాధపడుతూ ఉంటే మనమే చూడలేము కదా? అంత అద్భుతమైన శక్తులు అంతర్యామి రూపంలో మనలోనే ఉంటూ, మన చుట్టూరా ప్రకృతి రూపంలో ఉంటూ కూడా మనము బాధపడుతూ ఉన్నామంటే మన చేతకానితనము అది. మనం అతనికి లొంగకుండా ఉన్నాము. మనం ఎలాంటి ఫలితాలు ఆశితామో అలాంటి ఫలితాలు రావాలి అని కోరుకుంటాము. మనం నిర్దేశిస్తాము ఆ భగవంతుడిని, దయచేసి ఆ భావనని ఈ క్షణం నుంచి వదిలేయండి.

ఆ ప్రేమలో మీరు లీనమయిపోండి. అలా లీనమయిపోయిన తరువాత ఆ శక్తిధారలు మీ జీవితాన్ని, మీ కుటుంబములో ఉన్న వారి జీవితాల్ని వారి జీవితలక్ష్యానికి అనుగుణంగా మారుస్తుంది. వారి జీవితం ఆనందమయమవుతుంది. మీరు అనుకుంటున్నట్టుగా మీ జీవితాలు మారతాయో లేదో తెలియదు గానీ, ఖచ్చితంగా ఆనందమయంగా ఉంటాయి. అడవిలో ఉన్నా సుఖంగా జీవించగలము గురువుకి సర్వసమర్పణ చేసుకుంటే. ఆయనకి తెలుసు మనల్ని ఎలా నడిపించాలో, ఎక్కడకి తీసుకెళ్ళాలో. ఈ పరిస్థితులలో ఆ సర్వసమర్థుడికి, సర్వజ్ఞుడికి, సర్వవ్యాపకుడికి అప్పగించేయవచ్చుగా హాయిగా. ఇది మీకు అర్థం అయిపోతే మీ జీవితాలు ఆనందమయమే మీకెందుకు? ఎవరికి ఏలమైతే? కానీ ఆ గురువుకి అప్పజెప్పండి. అప్పజెప్పే బాధ్యత మీకు ఉంది. మీలో ఉన్న ఆ శక్తిధారలకు అప్పజెప్పండి.

మానవులుగా జన్మించిన మనకు ఆ బాధ్యత ఉంది. అది మన జీవితాలకు అర్థం కల్పిస్తుంది. కళ్ళుమూసుకొని అంతా మరచిపొండి. హాయిగా, నిశ్చింతగా మనస్సులో మనకు మార్గదర్శనం చేస్తున్నటువంటి గురుమూర్తిని స్మరించండి. బైటవున్న ఈ గురువు, లోపలనున్న ఆ గురువుల వద్దకు తీసుకుని వెళ్ళడం కొరకే. ఇంక ఈ గురువు అక్కరలేదు మీకు. ఆ గురుతత్త్వాన్ని,స్పర్శను అనుభవించండి. ఆ స్పర్శను ఈ రోజు తీసుకోండి. మీ భావన మీ స్థాయి యొక్క తీవ్రత మిమ్ములను మీలో ఉన్నటువంటి గురువు దగ్గరకు తీసుకువెళ్ళాలి. సర్వాంతర్యామి ఆ గురువు, సర్వసమర్థుడు ఆ గురువు, సర్వవ్యాపి.అందులో సందేహము లేదు. కాని ఈ బాహ్య ఆడంబరాలు, బాహ్యపూజలద్వారా అక్కడకు వెళ్ళడం మానేసి మనం మాత్రమే సంశయంలో పడటమే కాకుండా మిగతా వారిని కూడా సంశయంలో పడేస్తాము. మన సాధనలో ఈ అనుగ్రహపీఠాలు అన్ని ఏర్పరుచుటలో నా ఉద్దేశ్యం మీరు పూజలు ఎక్కువ చేయాలని కాదు, సాధన ఎక్కువ చేయాలనే. సాధన అయినా మీకు ఫలితాన్ని ఇవ్వాలంటే మీలో ప్రేమతత్త్వము ఉండాలి.రావణాసురుడు చనిపోయిన తరువాత అతని ఆత్మ రామునిలో లీనమయిపోతుంది. శిశుపాలుని యొక్క ఆత్మ కృష్ణునిలో లీనమయిపోతుంది. తనకు శత్రువైన శిశుపాలుని ఆత్మని కూడా తనలో కలిపేసుకున్న ప్రేమతాత్త్వము, ఆ ప్రేమతత్త్వం మీలోనూ రావాలి.

మిమ్ములను మీరు, మీ శరీరాన్ని ప్రేమించండి. ఇక్కడ కూర్చున్న వారినందరిని ప్రేమించడం నేర్చుకోండి. ఈ సంపూర్ణ విశ్వంలో ఉన్న ప్రతీ ప్రాణినీ ప్రేమించడం నేర్చుకోండి. ఆ భావన చేయండి. అది తెచ్చుకోకుండా ఏమి చేసినా లాభం లేదు. దాని తరువాతే మిగతా పనులు చేయండి. మీరు అద్భుతంగా ఎవరినైతే ప్రేమిస్తారో వారిని ఊహించుకోండి, ఆ భావనని అందరివైపుకి ప్రసరించనివ్వండి.

ఆ ప్రేమని బయటకు రానివ్వండి, లోపల దాచుకోవడం ఎందుకు, ఆ ఆవేదన, ఆ ఆనందాశ్రువులు రానివ్వండి, ఆరాధన చేసే వ్యక్తి ఎవరైనా కావచ్చు, దాని గురించి స్పష్టంగా రూపకల్పన చేసుకోండి. ఆ క్షణంలో మీకు ప్రేమగల

మూర్తులని ఎవరనిపిస్తారో వారిని తలచుకొని, ఆ ప్రేమను అణువణువునా, చిందుతున్న ఆ ప్రేమని మీ కుటుంబసభ్యులందరి మీదా ప్రసరింపనివ్వండి. ఆ ప్రేమను అందరికీ పంచండి. ఒక సాయిని ఎలా ప్రేమిస్తారో, ఒక కృష్ణుడిని ఎలా ప్రేమిస్తారో, ఎలా ఒక అమ్మని ప్రేమిస్తారో, ఆ ప్రేమను అలాగే మీ సభ్యులందరకి అందించడం నేర్చుకోండి. ప్రతీ వ్యక్తిని ఊహించుకొని ఆ ప్రేమను అందచేయండి. ఎంత ఆనందమో ఇంత మందిని ప్రేమించగలుగుతున్నాము.

నిజమైన ప్రేమని, స్నేహితులను చేర్చుకోండి. స్నేహితులను, మీకు ఆత్మీయుడైన దైవాన్ని ఎలా చూస్తారో అలాగే మీ కుటుంబములోని వారినందరినీ, ప్రతీ వ్యక్తిని, సమూహాల్ని చూడండి. ఇది వరకు వారి మీద ఉన్న అగౌరవభావాన్ని కడిగివేయండి. మెల్లగా ఈ ఊరంతా, ఈ ప్రపంచము అంతా, ఈ పృధ్వీ మీద ఉన్నటువంటి సకల జీవరాసులను, జంతువులను అన్నింటినీ ప్రేమించండి. ప్రేమమూర్తులు అయిపోండి మీరు. అటువంటి ప్రేమమూర్తుల సాధన ఫలిస్తుంది తప్ప మిగతావాళ్ళ సాధన ఎందుకు ఉపయోగపడదు.

అదే మన సాధనలో ఉండే లోటు.ఇప్పుడు మీకు నచ్చని వాళ్ళని కూడా మీ ప్రేమలో కలుపుకోండి,స్పష్టంగా ఊహించండి. ఏమీ తప్పులేదు.వాళ్ళను కూడా మీ హృదయంలో చేర్చుకోండి,కౌగిలించుకుని మీకు ఎవరి మీదైనా కోపం ఉన్న, ద్వేషం ఉన్నా, తీవ్రమైనటువంటి భావతీవ్రత ఉన్నా మరచిపోండి. ఈ ధ్యానసమయంలో మీ యొక్క విరోధులను కూడా, మీకు నచ్చని వారిని కూడా మీరు మొదట మీ ఇష్టదైవాన్ని ఏ భావంతో చూడగలిగారో అదే భావనతో వచ్చేటటువంటి ప్రేమ, ఆ ప్రేమను మళ్ళీ గుర్తుచేసుకోండి, నిరంతరం గుర్తు ఉంచుకోండి. మీ ఇష్టదైవాన్ని చూస్తే ఎట్లా స్పందిస్తారో, ఆ స్పందనను, ఆ భావసంవేదనను అందరియందు ఉంచుకోండి.

ఆ భావావేశం, ఆ భావస్పందన భగవంతుడిని చూడడమంటే 'యద్ భావో తత్ బవతి" నీవు బాహ్యంగా ఎంత అలంకరించుకున్నా, దేవతామూర్తిని అలంకరించినా, హృదయంలో ఆ భావన లేకపోతే ఏమీ లాభం లేదు. హృదయంలో భావన ఉంటే ఒక్క తులసీదళం చాలు, శ్రీ కృష్ణ తులాభారం నేర్పేది అదే మనకి. అదే మనం మళ్ళా మరచిపోతాం.ఇతరులకి ఆనందాన్ని, ప్రేమని పంచుదాం అనే భావన తీవ్రం చేసుకోండి. మీకు ఆవేదనగా ఉన్న పరిస్థితులు కొన్ని ఉంటాయి. ఉద్యోగవిషయంలో, రకరకాల విషయాలలో ఆ ప్రేమను దాని మీద ప్రసరింపచేయండి. ఇది ఇలా జరగాలి అని మాత్రము పొరపాటున కూడా అనుకోకండి.ఎప్పుడూ ఇంకొకరిని లొంగదీయడానికి ప్రయత్నించకండి. అందరూ నా మాట వినాలి అని అనడం కాదు. ఎవరూ మీకు లొంగిపోరు. మీరు ఇక్కడ ఆలోచించవలసింది అది. మీకు నచ్చని పదార్ధాల మీద, మీకు నచ్చని పరిస్థితుల మీద అనుకూలంగాలేని పరిస్థితులమీద ఆ గురుప్రేమను ప్రసరించనీయండి. ఆ గురువు యొక్క కిరణాలు, సమూహము, ఆ పరిస్థితిని తీసుకొని వెళ్ళి అలా వదిలివేయండి, గురువు పాదాల వద్ద గురుదేవా సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు, సర్వసమర్ధుడు అయినటువంటి నీ ముందు

ఉంచుతున్నాను. నా ఈ సమస్యని ఏమి చేయదలుచుకున్నావో నీవే చేయి. నాకంటే నీకే తెలుసు, నేను నీకే ఇలా చెయ్యి అని చెప్పను.

మీ సమస్య ఏదైనా కావచ్చును. మీరేమీ సంకోచించనక్కరలేదు గురువు దగ్గర. అంతకంటే ఆత్మీయుడు, కావలసినవారు మీకు లేరు. అంతకంటే దగ్గరవాడు ఎవరు ఉంటారు? అతని దగ్గర సంకోచమెందుకు? నీకు నీ గురించి తెలియని విషయాలు ఆయనకు తెలుసు. ఆయన ముందు ఏపైనా కావచ్చు, అన్ని ఆయన ముందు పెట్టుకోండి, అతన్ని శాసించకండి. ఒక సర్వాంతర్యామికి, ఒక సర్వవ్యాపకుడికి, ఒక సర్వ సమర్ధుడికి మీరు చెప్పనక్కరలేదు. ఆయనే చూసుకుంటాడు.దానిని నివారించడానికి ఏం చేయాలో మీరు చెప్పడమెందుకు? డాక్టరు దగ్గరకు వెళ్ళి మీ బాధ చెబుతారు. ఆ బాధకు ఏ మందు వేయాలో, ఎన్ని సార్లు వేయాలో, ఏ మోతాదులో వేయాలో నిర్ణయించేది డాక్టరు, మీరు కాదు.

## మన విశ్వాసరాహిత్యం మన ఉపలబ్దిని సగంలోనే ఆపేస్తుంది.

సర్వాంతర్యామి అయినటువంటి సర్వవ్యాపి అయినటువంటి,సర్వజ్ఞుడు అయినటువంటి ఆ గురువుకి చెప్పడానికి మీ సమస్యలను స్పష్టంగా మనస్సులో ఊహించుకోండి. ఎప్పుడో కాదు, ఇప్పుడే మీ సమస్యలను చెప్పుకోండి. మీరనుకున్నట్లు ఆయన చేస్తాడో లేదో అనేది నకు తెలియదు, అది ఆయనకి మనకంటే బాగా తెలుసు.మనకంటే బాగా మన సమస్యలను ఆయన బాగా నివారించగలడు. ఆ నమ్మకమే ఈ ఆధ్యాత్మికతలోనికి ప్రవేశించడానికి మొదటిమెట్టు,ఆఖరిమెట్టు కూడా. స్పష్టంగా ఒక్కొక్క సమస్యను ఆ గురువు ముందు నివేదించండి. తొందర పడవద్దు. గురుదేవా ఈ సమస్యను నీ ముందు పెట్టేను. ఈ అంధకారాన్ని తీసివేసేటటువంటి, ఈ బాధను తొలగించేటటువంటి సత్తా నీకు తప్ప మరెవరికి లేదు. ఆనందదాయకమైన అనుభూతితో మీకు కొంచెము ఆవేదన వచ్చినా తప్పుకోకండి. గురువు ముందు కూడా కన్నీళ్ళు కార్చడానికి సిగ్గుపడితే ఇంకెందుకు మనం? ఏమీ గాబరా లేకుండా ఆవేదన ఆయనకు చెప్పండి. అదే తప్పు ఎక్కడ చేస్తామంటే అదే దీనబంధూ అనేది ఈ స్థితిలోనే, ఉత్తినే నోటితో అంటే లాభం లేదు. ఈ స్థితిలోనే ఉన్నారు, ఆయన మీద వదిలేయండి.

రెండవ సమస్య పెట్టేయండి. ఆయన ముందు ఇలా జరుగుతున్నది మాకు, కుటుంబములోని వ్యక్తులందరూ ఇలా ప్రవర్తిస్తున్నారు. దీని వలన నా మనస్సు ఇలా బాధ పడుతున్నది. ఏ కర్మ పరిపక్వము అవ్వడానికి ఈ పరిస్థితులు నీవు కల్పించినావో నేను నిన్ను ప్రశ్నించడంలేదు, నువ్వు సర్వజ్ఞుడివి. ఇలాంటి పరిస్థితులలోనే నేను జీవించాలి అనుకుంటే నీ కోరికకు మాత్రము నేను ఎదురువెళ్ళను.నీకు నా బాధ చెప్పుకునే హక్కు నాకుంది. ఈ పరిస్థితులలో నేను నేర్చుకోవాల్సిన పాటాన్ని నేర్చుకున్నానంటే నీ వలన మాత్రమే. నీ వలన నేను అందరిని ప్రేమించడం నేర్చుకుంటే ఆ

పరిస్తితులు ఉండవు కదా? ఆ ప్రేమతత్త్వాన్ని నాలో నింపు. బాహ్యావ్యక్తులు ఎలా ప్రవర్తించినా కూడా ఆ పరిస్థితులకు అనుగుణంగా మారగలిగే శక్తినైనా నాకియ్యి లేదా పరిస్థితులనైనా మార్చు. ఇది చెయ్యి అని మాత్రము నేను ఖశ్చితంగా చెప్పను. నా ఆవేదనను మాత్రము చెప్పుకుంటున్నాను. కుటుంబములో మనకు నచ్చని పరిస్థితులు మార్చకండి, వాళ్ళు మీరనుకుంటున్నట్లుగా మారుతున్నారు. అవేమి వద్దు.అట్లా చేస్తే మీ సాధన మొత్తం తప్పు అవుతుంది.వాళ్ళు మారిపోవాలి, వీళ్ళు మారిపోవాలి అంటే అది వశీకరణ మంత్రాలు కావు, తంత్రాలు కాదు. విశుద్ధమైనటువంటి ప్రేమతత్త్వాన్ని, గురువు యొక్క ప్రేమజ్యోతి వెలుగుని ఆ పరిస్థితి మీద ప్రసరింపచేయండి. అదే తెలుసుకోండి.పరిస్తితులను మనం మార్చడం లేదు, పరిస్థితులు మనకు అనుగుణ్యంగా మారాలి అనుకోవడం లేదు. ఆ తప్పు మాత్రము చేయకండి. ఎంట్రన్సులో పాసు అయిపోవాలి, యూనివర్సిటీ ఫస్టు రావాలి, నేను ఒక్కడినే జీవించాలి అనే స్వార్థమైనటువంటి ఆలోచనలకు ఏ గురువు వద్ద తావు లేదు. అందరూ సుఖంగా ఉండాలి కాని, ఈ పరిస్థితిలో నేను సుఖంగా ఉండి, ఇతరులు సుఖంగా ఉండే పరిస్థితి నాకు కనపడడం లేదు.

గురుదేవా! ఈ పరిస్థితికి పరిష్కారం నువ్వు ఆలోచించు. అవి ఏవైనా కావచ్చు. సమస్యలు రకరకాలు. సిగరెట్టు తాగటాలు దగ్గర నుంచి త్రాగుడు త్రాగడాలు దగ్గర ఆఫీసు స్టాఫ్ తో వచ్చే సమస్యలు, స్నేహితుడు స్నేహితుడికీ మధ్య వచ్చే సమస్యలు, ఆఫీసర్ కి కింద వాళ్ళకి మధ్య వచ్చే సమస్యలు ఏవైనా కావచ్చు మీ స్వంత సమస్యలు, మీకు ఏది బాధపెడ్తూఉన్నదో దాన్ని ఆ గురుమూర్తికి అందచేయండి. స్పష్టంగా చెప్పుకోండి.ఎందుకు ఈ ఆలస్యం. ఇన్నాళ్ళ బట్టి నిన్ను వేడుకుంటున్నానే ఎందుకు పరిస్థితులు మారలేదు, దానికనుగుణ్యంగా నేను మార్చుకోవలసి ఉంటే ఎలా మారాలో నాకు తెలియదు. అది కూడా నువ్వే చెయ్యి. నేను ఒక మైనపు ముద్దవంటివాడను, నువ్వు నన్ను ఎలా మలుచుకుంటావో అలా మారిపోతాను. ఈ ప్రేమ పరిస్థితి అనేది, ఈ ప్రేమ అనేటటువంటి కల్పవృక్షము, ఈ ప్రేమ అనేటటువంటి కామధేనువు  మూడు స్థాయిలలో, భౌతికస్థాయిలో పరుసువేదిగా, కోరికస్థాయిలో కల్పవృక్షముగా, మానసికస్థాయిలో కామధేనువుగా మారుతుంది.ఈ అద్భుతమైనటువంటి శక్తి యొక్క ఘనీభవించిన రూపాన్ని మనం దత్తాత్రేయ రూపమని పిలుస్తాము.గురువుకి,దత్తాత్రేయుడికి తేడా లేదు. ఇది ప్రపంచానికి అర్థమయితే కొన్ని ధర్మాలు అవసరం ఉండవు. ఇన్ని మతాలు మనకి అవసరం ఉండవు. ఏమీ అక్కరలేదు.

ఒక వ్యక్తి ఇంజనీరు అవుతున్నాడు అంటే ఇంజనీరు అయ్యుయే సామర్థ్యం అతనిలోనే లేకపోతే గురువు ఏం చేస్తాడు? ఒక వ్యక్తి డాక్టరు అవుతున్నాడు అంటే అతనికి పాఠం నేర్పేటటువంటి గురువు, విద్యనేర్పే గురువు విద్య అతనికి బోధిస్తున్నాడు నిజమే కానీ ఆ విద్యను అతను స్వీకరించకపోతే, బోధపడకపోతే డాక్టరు అవలేడు కదా? అలాగే గురువు ఉదాహరణము.ప్రేమ అనేటటువంటి శక్తిని మీకు అందిస్తుంది. మళ్ళీ గుర్తు చేసుకోండి. ఆ ప్రేమస్వరూపం. ఏ నమాన్ని మీరు తలుచుకుంటే మనస్సు పులకరిస్తుందో ఆ నామంతో, యే స్వరూపాన్ని తలుచుకుంటే మనస్సు ఆనంద డోలికల్లో

ఊగుతుందో ఆ నామం అనుకోండి మనస్సులో, ఆ రూపాన్ని మనస్సులో తెచ్చుకుని ఆ స్ఫూర్తి, ఆ ప్రేమను ప్రపంచమంతటా పంచిపెట్టండి. కళ్ళు మూసుకుని ఆ నామాన్ని, గురువుని స్మరిస్తూ ఇటువంటి ఆనంద తరంగాలను ప్రపంచమంతటా పంచండి.

ప్రపంచములో ఎవరెవరు ఎక్కడెక్కడ ఏ ఘురువులను తలుచుకున్నా కూడా ఈ ప్రేమస్వరూపాన్ని, ఈ సర్వజ్ఞత్వాన్ని, ఈ సర్వవ్యాపకత్వాన్ని, ఈ సర్వసమర్ధతని తలుచుకుంటున్నారు. ఏ రూపంతో తలుచుకుంటే, ఆ రూపంలో అందరికీ అలా విస్తరించాలి. ఆ ప్రేమను మనస్సులో పంచాలి. మెల్లగా కళ్ళు తెరవండి. అదే స్థితిలో ఉండండి నిరంతరము. మీ ఆఫీసులో, మీ ఇంట్లో ఎక్కడైనా, ఎప్పుడైనా. మీకు బాధించే పరిస్థితులు ఎదురైనప్పుడు ఎక్కడెక్కడ ఉన్నా తక్షణమే కళ్ళు మూసుకుని గురువుకి చెప్పేయండి. మళ్ళీ మళ్ళీ మీకు చెబుతున్నాను. ఇది వశీకరణమంత్రము కాదు, ఇతరులను దీని ద్వారా మార్చలేరు కాని, అందరూ ప్రేమ స్వరూపులుగా మారిపోయి ఈ ప్రపంచమంతా ఒక విశిష్టమయిన, ఆనందమయమైన సామ్రాజ్యంగా మారడానికి మాత్రమే ఈ సాధన. మీకు నచ్చని పరిస్థితులు, అవి కూడా మీరు అనుకున్నట్లుగా మారకపోయినా మీరు ఆనందంగా జీవించడానికి కావలసిన పరిస్థితులు మాత్రము మీకు ఖచ్చితంగా లభిస్తాయి.ఈ ప్రేమసాధన ప్రతీ రోజు వీలైతే నిరంతరం చేసుకోండి.కొన్ని ఇమీడియట్ సమస్యలు నన్ను అడుగుతూ ఉంటారు, ఆ బాధలు భరించలేకుండా ఉన్నాము.ఆ బాధను కూడా గురువుకి నిరంతరము అప్పచెప్పండి.అక్కడ మీ బాధ పడేయండి. ఆ జగద్గురువు యొక్క ప్రజ్ఞ మనకు చేతకావటం లేదు, మన సమస్యలు ఆయన దగ్గర పడేసి నిరంతరము ఇలా చేసుకోండి.

ఈ ధ్యానములో మీకు ఉన్నటువంటి ఆవేదన, మీకు ఉన్నటువంటి ఆర్తి, సమస్యను గురువు దగ్గర దాచవలసిన పని లేదు. మీరు దాచివేస్తే తెలుసుకోలేకపోతే ఆయనేం గురువు? మీ పిల్లలను కొట్టి, తిట్టి స్కూలికి పంపుతాము బస్సు వరకు మనముంటాము కానీ అక్కడ మాత్రము వదిలిపెట్టేసి వచ్చేస్తాము. బాధ గ్యారంటీగా పడుతున్నారు, నువ్వు ఏమి చేయదలచుకున్నావో చేయి అన్న భావన కలుగనంతవరకు మనము ఆధ్యాత్మికస్థితిలోకి ప్రవేశించలేము. కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మీకు ఏది మంగళకరమో, క్షేమకరమో, ఏది మంచిదో అది నేను చేస్తాను అన్నప్పుడు, ఆయన మాటలమీద నమ్మకము ఉంచండి. నీవు ఏది చేయదలచుకున్నావో అది చేయి.ఈ సాధన మీరు ఉపయోగించుకోండి. చాలా హాయిగా, ప్రశాంతంగా మన జీవితాలు గడచిపోతాయి.

స్వస్తి.